క్లుప్తంగా

ఈత పోటీల్లో సత్తెనపల్లి వాసులు



సత్తెనపల్లి: విజయవాడలోని దుర్గ ఘాట్ వద్ద కృష్ణా నదిలో ఆక్వా డెవిల్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కిలో మీటరన్నర ఈత పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో సత్తెనపల్లి వాసులు షేక్ గని, నిమ్మగడ్డ హనుమంతరావు, కాకుమాను జోజి, పెరుమాళ్ళ శ్రీనివాస్, చంద్రపాటి శ్రీనివాస్, పోతుగంటి నరసింహారావు, కాకర్ల రమేష్, ఆదిరెడ్డి, సాంబశివరావు, రాజేష్ నాయక్, బుజ్జి పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళికా అధికారిగా రాధాకృష్ణ



సత్తెనపల్లి: పట్టణ ప్రణాళికా అధికారిగా పుల్లా రాధాకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి ఆయన బదిలీపై సత్తెనపల్లి టీపీఓ వచ్చారు. ఇక్కడ టీపీఎస్‌లు గా పని చేస్తున్న సునీత, రిజ్వానాలు టీపీవోలుగా ఉద్యోగోన్నతి పొంది విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ అందరి సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన రాధాకృష్ణను పలువురు మున్సిపల్ ఉద్యోగులు అభినందించారు.

వై జంక్షన్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్



నకరికల్లు: మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ఎస్ఐ చల్లా సురేష్ హెచ్చరించారు. స్థానిక అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై వై జంక్షన్ వద్ద ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు వాహనాలు నిలిపి తనిఖీలు చేశారు. డ్రైవర్‌లకు బ్రీత్ ఎనలైజర్‌లతో పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న వారిపై ఐదు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రమాదాలు అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ప్రధానంగా మద్యం సేవించి వాహనాలు నడిపి ఎదుటివారికి ప్రాణాపాయం తీసుకురావద్దని సూచించారు.

డ్రైయిన్ల నిర్మాణ పనులకు భూమిపూజ

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో బీసీ కాలనీలో జాతీయ ఉపాధి నిధులతో రూ.10 లక్షల వ్యయంతో సీసీ డ్రైన్స్, కల్వర్టు నిర్మాణ పనులకు ఆదివారం భూమి పూజ చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి తెలిపారు. 250 మీటర్ల సీసీ డ్రైన్స్ పనులు ప్రారంభించామని పొక్లెయిన్ ద్వారా ఇరువైపుల కాల్వ పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే మండలంలోని కారుమంచి గ్రామంలో రూ. 23 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు 170 మీటర్ల పనులు జరుగుతున్నాయన్నారు. పనులు ప్రారంభించిన వారిలో గ్రామపెద్దలు గోరంట్ల హనుమంతరావు, ముక్కపాటి నాగేశ్వరరావు, బోడెపూడి శంకరు, కాసరగడ్డ వెంకటరత్నం, వీరయ్య తదితరులు ఉన్నారు.

రైతు ప్రతిఫలానికి ..ప్రభుత్వ సాయం

- ఎండ్ల తోటల విస్తరణకు ప్రభుత్వాల తోడ్పాటు
- సాగు పెట్టుబడిలో 50 శాతం రాయితీ
- మూడేళ్లపాటు అమలు
- ఆటుపోట్లను తట్టుకునే అవకాశం
- పల్నాడు భూములు సాగుకు అనుకూలం



మామిడి తోట

అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గంలోని సాగు భూములు పండ్ల తోటలకు చాలా అనుకూలం. అయితే రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలపై మోజుతో పండ్ల తోటలను విస్మరిస్తున్నారు. రైతులు తమకున్న భూమిలో కనీసం కొంత భాగాన్ని పండ్ల తోటలకు కేటాయించినట్లయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఉద్యానవన శాఖల ద్వారా అందించే రాయితీ పొందవచ్చు. ఈ రాయితీ మూడేళ్లపాటు వినియోగించుకోవచ్చు. పండ్ల తోటలు వేసిన రైతు ఒకసారి స్థిరపడితే ఏటా పెట్టాల్సిన పెట్టుబడులు తగ్గి, రోజువారీ ఫల సాయాలు పొందే వీలుపడుతుంది.

తోటల విస్తరణ పథకం

నియోజకవర్గంలోని రైతులు తమ భూముల్లో మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, బొప్పాయి, అరటి మొదలైన పంటల విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఉపాధి హామీ పథకం, ఉద్యానవన శాఖల ద్వారా అవకాశాలున్నాయి. మూడేళ్ల పాటు ప్రభుత్వం నుంచి సాయం పొందవచ్చు. ఉదాహరణకు హెక్టారు పంట విస్తీర్ణంలో 1,600 మొక్కలతో మామిడి తోట వేసినట్లయితే మొదటి ఏడాది రూ.24,000, రెండవ ఏడాది రూ.8వేలు, మూడవ ఏడాది రూ.8వేలు చొప్పున మొత్తం రూ.40వేలు సబ్సిడీపై పొందవచ్చు. ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు వేసుకున్నట్లయితే ఇంకా ఎక్కువ సబ్సిడీని పొందే అవకాశం ఉంది. ఇలా నిమ్మ, బత్తాయి, జామ, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, ఉసిరి, అల్లనేరుడు, చింత, అరటి, బొప్పాయి పంటలపై కూడా ప్రభుత్వం నుంచి మూడేళ్లపాటు సబ్సిడీని పొందే అవకాశం ఉంది.

పెట్టుబడి భారం సగం ప్రభుత్వానిదే..

- హై బ్రీడ్ కూరగాయల సాగు పథకం ద్వారా హైబ్రీడ్ కూరగాయల సాగు కోసం హెక్టారుకు అయ్యే ఖర్చులో 50 శాతం వరకు సబ్సిడీ పొందవచ్చు.
- పూల పెంపక పథకం ద్వారా గులాబీ, గడ్డ సంపెంగి(లిల్లీ), బంతి, కనకాంబరం, చామంతి తదితర పంటల్లో కూడా 50 శాతం రాయితీ పొందే అవకాశం ఉంది.
- లాభదాయకంగా లేని పాత తోటలను పునరుద్ధరించుకునేందుకు కూడా 50 శాతం సబ్సిడీ పొందవచ్చు.
- రైతులు వేసిన పండ్ల తోటల విస్తీర్ణంలో కొంత భాగాన్ని నీటి కుంటలు తవ్వుకునేందుకు వినియోగిస్తే.. అయ్యే ఖర్చులో 50 శాతం రాయితీ పొందవచ్చు.
- పండ్లతోటల సాగులో కలుపు నివారణ, కూలీల ఖర్చు తగ్గించుకోవడం, నేలలో తేమ శాతం నిల్వ ఉంచుకొని అధిక దిగుబడులు పొందవచ్చు. దీనికి కూడా ప్రతి హెక్టారు భూమికి 50 శాతం సబ్సిడీ లభిస్తుంది.
- తోటల వద్ద పండిన పండ్లను సేకరించడం, వాటిని గ్రేడింగ్ చేసి ప్యాకింగి చేసుకునేందుకు ప్యాక్ హౌస్ నిర్మించుకునేందుకు గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు రాయితీ పొందవచ్చు.
- ఉద్యాన యాంత్రీకరణలో భాగంగా మినీ ట్రాక్టర్లు, పవర్ వీడర్స్, తైవాన్ స్ప్రేయర్లు, మొదలైన వాటి కొనుగోలుపై 50 శాతం రాయితీ లభిస్తుంది.
- శాశ్వత పందిళ్ల నిర్మాణ పథకం ద్వారా కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి 50 శాతం రాయితీ ఇస్తారు.
- రైతులు పండించిన కూరగాయలు, పండ్లు, ఇతర ఉత్పత్తులు ప్లాస్టిక్ క్రేట్స్‌లో నింపి వాహనాలలో రవాణా చేయడం జరుగుతుంది. ప్లాస్టిక్ క్రేట్స్‌లను రైతుల 50 శాతం సబ్సిడీతో పొందవచ్చు.

పండ్ల తోటల పెంపకానికి 50శాతం రాయితీ



వాణిజ్య పంటలు వేసి నష్టాల ఊబిలో కూరుకునే దానికన్నా.. ఉన్న భూమిలో కొంత భాగాన్ని పండ్ల తోటలకు వినియోగించుకుంటే మొక్కలు వేసేనాటి నుంచి, పండిన పంటను మార్కెటింగ్ చేసుకునే వరకు మూడేళ్ల పాటు ప్రభుత్వం నుంచి ఖర్చులో 50 శాతానికిపైగా రాయితీ ఇస్తుంది. కొన్ని పండ్ల తోటల్లో అంతర్ పంటలు కూడా వేసుకునే వెసులుబాటు ఉంది. పండ్ల తోటల పెంపకం వల్ల ఏళ్ల పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలసాయాన్ని పొందవచ్చు.

– శ్రీనిత్య, ఉద్యానశాఖాధికారి

కనుల పండువగా సత్తెమ్మతల్లి కల్యాణం



అచ్చంపేట: మాదిపాడు పంచాయతీ అడవులలో స్వయంభు సత్తెమ్మతల్లి దేవాలయంలో ఆదివారం జరిగిన కల్యాణ మహోత్సవానికి భక్తులు పోటెత్తారు. ప్రధాన అర్చకులు మేడేపల్లి అప్పయ్యశాస్త్రి సత్యదేవుడు, సత్తెమ్మ తల్లి కల్యాణం జరిపించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో చండీ పారాయణం జరిపించారు. దేవాలయ కమిటీ చైర్మన్ కొరివి వెంకట నరేష్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. సత్తెమ్మతల్లి పుట్టి నిల్లు చింతపల్లి, అత్తారిల్లు మాదిపాడు గ్రామాల నుంచి ఆయా గ్రామాల పెద్దలు లాంఛనాలు తీసుకు వచ్చారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పొంగించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉత్సవ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు శిశు మందిర్‌లో అక్షరాభ్యాసం

సత్తెనపల్లి: వసంత పంచమిని పురస్కరించుకొని పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో సోమవారం అక్షరాభ్యాసం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు పులుపుల వెంకట ఫణికుమార్ శర్మ హాజరవుతారన్నారు. ఉదయం 9 గంటలకు హోమం, 9:45 గంటలకు అక్షరాభ్యాస కార్యక్రమం జరుగుతుందన్నారు.

సమష్టి కృషితో పార్టీకి పూర్వ వైభవం

ఫీజు పోరు పోస్టర్లు ఆవిష్కరించిన సమన్వయకర్త గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి



ఫీజుపోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

నకరికల్లు: కార్యకర్తల సమష్టి కృషి పార్టీకి పూర్వ వైభవం తెచ్చిపెట్టి, మరోసారి అధికారంలోకి తెస్తుందని సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి అన్నారు. పార్టీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్యక్షతన స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మహా నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ నెల 5న చేపట్టబోయే ఫీజు పోరు పోస్టర్‌లను ఆవిష్కరించారు. సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించిన గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి తొలిసారి మండలానికి రావడంతో కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఫీజు పోరుకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు అమలు చేయలేమని చేతులెత్తేసి సామాన్యులపై పెనుభారం మోపుతోందన్నారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల శివారెడ్డి, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల బాషా, బీసీ విభాగం అధ్యక్షుడు కోనంకి ఆదినారాయణ, యూత్ విభాగం అధ్యక్షుడు గుత్తికొండ నన్నేసా, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, కావేటి రామాంజినేయులు, మురికిపూడి నాగేశ్వరరావు, కందుల లక్ష్మారెడ్డి, సంగు శివారెడ్డి పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు సాధించే వరకు పోరాటం



సత్తెనపల్లి: రాష్ట్రంలో పేదలు అందరికీ ఇళ్ల స్థలాలు సాధించేవరకు సీపీఐ అండగా ఉండి పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. సత్తెనపల్లి పాత బస్టాండ్ లో ఉన్న పార్టీ కార్యాలయంలో పేదలకు ఇళ్ల స్థలాల అర్జీల నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పదేళ్లలో రాష్ట్రంలో పలు గ్రామాల్లో, పట్టణాల్లో పేదలకు పక్కా ఇల్లు కావాలని నిర్ణయిస్తూ కేంద్ర ప్రభుత్వం కొన్ని స్కీంలు ప్రకటించిందన్నారు. అవన్నీ కూడా రాష్ట్రంలో సక్రమంగా అమలు కాలేదన్నారు. ఇళ్ల స్థలాలు లేని పేదలందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక ఇంటి నిర్మాణానికి కనీసం రూ.5 లక్షలు లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. సీపీఐ ఒత్తిడి తేవడంతో ఎన్నికలకు ముందు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు లేని పేదలకు అందజేస్తామని టీడీపీ వాగ్దానం చేసిందన్నారు. ఆ వాగ్దానం అమలుకు నవంబరు ఒకటి నుంచి గ్రామ గ్రామాన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో 8 లక్షల మంది పేదల చేత అర్జీలు పెట్టించడం జరిగిందన్నారు. సంబంధింత అర్జీలను 10వ తేదీ ఆయా వార్డులో ఉన్న సచివాలయంలో అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి వల్లెం లక్ష్మీచెన్నకేశవరావు, ఆర్. శేష గిరిరావు, కంబాల శ్రీనివాసరావు, గండేపల్లి వెంకటరావు, ఇళ్ల స్థలాలు లేని పేదలు ఉన్నారు.

సువార్త మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘ కాపరి జరుగుమల్లి ఇశ్రాయేలు

సత్తెనపల్లి: పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ 130వ వసంతాల వేడుకలు, నూతన మందిర 4వ వార్షికోత్సవం ఈ నెల 12, 13, 14 తేదీల్లో జరుగనున్నాయని సంఘ కాపరి రెవరెండ్ జరుగుమల్లి ఇశ్రాయేలు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా మూడు రోజులపాటు ప్రతి రోజూ రాత్రి 7 గంటల నుంచి 'రక్షణ ఉజ్జీవ సువార్త మహా సభలు' పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్(చర్చ్ మైదానం)లో జరుగుతాయన్నారు. ఈ సభలకు చెందిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుజ్జర్లపూడి స్కైలాబ్, కార్యదర్శి కె.ఎం.ఆనిరాజ్, సంయుక్త కార్యదర్శి బంకా కిషోర్ బాబు, కోశాధికారి గుజ్జర్లపూడి రవిరాజు, కార్యవర్గ సభ్యులు సంగెపు నరేష్, దంతం కుమార్, ఆనందరావు, ఫ్రాన్సిస్, రాజరత్నం, జయపాల్ పాల్గొన్నారు.

ఐదు దశాబ్దాల అపూర్వ కలయిక



సాయిబాబా ఆలయంలో కలిసిన పూర్వవిద్యార్థులు

ముప్పాళ్ళ: వీరంతా సత్తెనపల్లి లోని శరభయ్య గుప్తా హైందవోన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు. 1965–69 లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేశారు. 12 సంవత్సరాల నుంచి ప్రతి ఏడాది మార్చి నెలలో కలుసుకుంటూ ఉంటారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఈ ఏడాది ముందుగానే ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. సహచరుడు, ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలేనికి చెందిన రామలింగారెడ్డి నిర్మించిన సాయిబాబా ఆలయంలో సుమారు 50 మందికి పైగా హాజరై గత స్మృతులను పంచుకున్నారు. ఆరోగ్య క్షేమాలు తెలుసుకుంటూ సరదాగా గడిపారు. సమ్మేళనానికి ముఖ్యుడైన రామలింగారెడ్డి ని స్మరించుకుంటూ, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పూర్వ విద్యార్థులు మారూరి సత్యనారాయణరెడ్డి, శివాజీ, యెలినేడి పట్టాభిరామారావులు బాధ్యులుగా వ్యవహరించారు.

వైభవంగా తులసి మాత ప్రతిష్టా వేడుకలు



అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అతిథులు

నూజెండ్ల(శావల్యాపురం): నూజెండ్ల మండలంలోని పమిడిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీతులసి మాత ప్రతిష్టా వేడుకలు ఆదివారంతో ముగిశాయి. గత మూడు రోజుల నుంచి తులసి మాతకు ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు వేదమంత్రాలు, మేళాతాళాల నడుము గ్రామస్తుల సారథ్యంలో ప్రతిష్టా వేడుకలు వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఒంటేరు వెంకట శ్రీనివాసరావు కుటుంబానికి చెందిన మూడు తరాలకు ఇలవేల్పుగా పూజలు చేయటం ఆనావాయితీగా వస్తుంది. ఈక్రమంలో పాత గుడి స్థానంలో రూ.50 లక్షల వ్యయంతో సొంత నిధులు కాగా కుటుంబ సభ్యులు, దాతలు సహకారంతో విరాళాలు రూపంలో సేకరించి దేవాలయం నిర్మాణ పనులు చేపట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న టీటీడీ పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గోనుగుంట్ల లీలావతి తదితరులు అమ్మ వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యడ్లపాడు-1 ఇన్‌చార్జి వీఆర్వోగా కేపీ చారి



యడ్లపాడు: సస్పెండైన వ్యక్తి స్థానంలో మరో విలేజ్ రెవెన్యూ అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చినట్లు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. యడ్లపాడు-1 వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న షేక్ సుభాని భూ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నడంటూ ప్రజావేదికలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గత నెల 17వ తేదీన సుభానిని సస్పెండ్ చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో మండలంలోని కారుచోల రెవెన్యూలో వీఆర్వోగా పనిచేస్తున్న కేపీ చారిని అడ్మినిస్ట్రేషన్ గౌండ్ కింద గ్రామ పరిపాలన సౌలభ్యం నిమిత్తం యడ్లపాడు-1 ఇన్‌చార్జి వీఆర్వోగా నియమిస్తూ శనివారం తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉచిత దంత వైద్యశిబిరం



డాక్టర్ ఆదిత్య, డాక్టర్ ఇందిరాదేవిని సత్కరిస్తున్న సత్రం కమిటీ సభ్యులు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని వాసవి ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ఆదివారం కార్తికేయ డెంటల్ కేర్ అండ్ ఇంప్లాంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు గాదంశెట్టి ఆదిత్య, ఇందిరా దేవిలు వైద్య శిబిరంలో పాల్గొని 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత సంబంధిత వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రోగులకు అవగాహన కల్పించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సత్రంలో ఆదివారాన్ని పురస్కరించుకొని అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అమ్మవారి ఆలయ ఈఓ ఎస్.మాధవిదేవిలు పాల్గొన్నారు. మహంకాళి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రతివారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు సత్రం నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కపిలవాయి కాశీరామారావు, రాజా చంద్రశేఖరరావు, ప్రోగ్రాం కన్వీనర్ బత్తుల మురళీ, గాదంశెట్టి రామకృష్ణ, చేగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లలో ...

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలోని నారాయణస్వామి మఠం వద్ద ఆదివారం ఉచిత పంటి వైద్య శిబిరం నిర్వహించారు. లక్ష్మమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట చందన డెంటల్ కేర్ అండ్ ఇంప్లాంట్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. దంత వైద్య నిపుణుడు డాక్టర్ కూరపాటి సంపత్‌కుమార్‌రాజు రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. ముందుగా మాజీ సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ చిలకలూరిపేటలోని తమ ఆసుపత్రిలో తక్కువ ఖర్చులో దంత పరీక్షలు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నందూరి శ్రావ్యచందన, భీమనబోయిన వెంకటఫణీంద్ర, రుక్సానా పాల్గొన్నారు.

సమస్యల నడుమ కేజీబీవీ

- విద్యాలయం చుట్టూ ముళ్ల పొదలు
- నిలిచిపోయిన ఇంటర్మీడియట్ తరగతి గదుల నిర్మాణం
- గదులు చాలక ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు
- కూటమి ప్రభుత్వంలో ఆగిన అభివృద్ధి పనులు



కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు చుట్టూ కంపచెట్లు

రాజుపాలెం: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రహరీ చుట్టూ ముళ్ల పొదలు చుట్టేశాయి. చుట్టూ పెద్ద పెద్ద చెట్లు ఉండడంతో దట్టమైన అడవిని తలపిస్తోంది. కేజీబీవీలో మండలంలోని పలు గ్రామాల బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 252 మంది విద్యార్థినులున్నారు. అందులో ఇంటర్మీడియట్ విద్యార్థులు 59మంది ఉన్నారు. వీరి కోసం కేటాయించిన మరుగు దొడ్లు ప్రహరీకి ఆనుకుని ఉండడంతో బాలికలు భయపడుతున్నారు. పాఠశాల చుట్టూ దట్టమైన ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. మరో వైపు అడవిని తలపించే దట్టమైన బీడు భూములు ఉన్నాయి. విషసర్పాలు, కీటకాల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి వేళల్లో మరుగుదొడ్లకు వెళ్లడానికి భయపడుతున్నారు. పంచాయతీ రాజ్, విద్యాశాఖ అధికారులు స్పందించి ముళ్ల పొదలను తొలగించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

అసంపూర్తిగా ఇంటర్మీడియట్ భవనాలు

కేజీబీవీలో ఇంటర్మీడియట్ విద్యార్థునులకు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు ఫేజ్–2 క్రింద ఈ నిర్మాణ పనులు ప్రారంభించారు. కింది గదులకు స్లాబు వేశారు. పై గదుల కోసం పిల్లర్స్ వేశారు. ఎన్నికలు రావడంతో పనులు నిలిచి పోయాయి. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనుల ఊసేలేదు. పాత భవనాలలోనే తరగతులు కొనసాగిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే నూతన భవనాలలో ఇంటర్మీడియెట్ తరగతులు ప్రారంభించాలనే ప్రణాళికలతో పనులు చేపట్టారు. ఇంటర్మీడియెట్ విద్యార్థినుల కోసం నిర్మించి మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. విద్యాశాఖాధికారులు స్పందించి, తరగతి గదుల నిర్మాణం త్వరితిగతిన పూర్తి చేయాలని విద్యార్థినులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



చుట్టూ ముళ్ల పొదలతో కేజీబీవీ




పాఠశాల గేటు ముందు ఇలా..



నిలిచిన ఇంటర్మీడియట్ తరగతి గదుల నిర్మాణం

ఆత్మజ్ఞాన సముపార్జనే లక్ష్యం



నరసరావుపేట ఈస్ట్: ఆత్మజ్ఞానాన్ని సముపార్జించటమే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీరామచంద్రమూర్తి (కందుకూరు) తెలిపారు. రెడ్డినగర్‌లోని మైత్రేయ బుద్ధ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం ఒకరోజు ధ్యాన శిక్షణ, ఆత్మజ్ఞాన బోధన కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి ప్రధాన బోధకునిగా హాజరైన శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ, ఆత్మజ్ఞానంతోనే సాధారణ మానవుడు మహనీయునిగా మారతాడన్నారు. ఆత్మజ్ఞానంకు మించిన జ్ఞానం లేదని స్పష్టం చేశారు. సమస్త వేదాల సారం ఆత్మజ్ఞానమేనని తెలిపారు. ధ్యానం ద్వారానే శారీరక, మానసికమైన రుగ్మతలు నయమవుతాయన్నారు. పిరమిడ్‌లో ధ్యానం చేయటం ద్వారా త్వరితగతిన ధ్యానస్థితిలోకి వెళతారని వివరించారు. ఈసందర్భంగా అభ్యాసకులకు ధ్యానం చేసే విధానాలను తెలిపారు. కార్యక్రమాన్ని ధ్యాన కేంద్రం నిర్వాహకుడు బి.చంద్రశేఖర్ పర్యవేక్షించారు.